

ఆఫీసు పని మీద విశాఖపట్నం వెళ్ళి పని చూసుకుని, తిరిగి బస్‌స్టాండ్‌కి వచ్చి బస్ కోసం చూస్తున్నాను. ఎవరో పిలుస్తున్నట్టయి పక్కకి తిరిగి చూసేసరికి శర్మ.

దాదాపు నాలుగేళ్ళయింది అతన్ని చూసి. చోడవరంలో మా ఇంటి పక్కనే వుండేవారు. ఉత్సాహంగా పలకరించేను. కుశల ప్రశ్నలు అయాక "సునీతకి పెళ్ళి చేసేరా?" అనడిగేను. సునీత అతని చెల్లెలు. చలాకీగా

## 'కాలమ్ దాటని కథ'

తిరుగుతుండేది. "పెళ్ళిచేసి వల్లకాటికి పంపించేం" అన్నాడు శర్మ బాధగా. "ఏమిటి నువ్వు చెప్పేది" అన్నాను నేను. "ఏం చెప్పమంటారు మూర్తి గారూ, పెళ్లయి ఏడాదిన్నర సంవత్సరంవరకూ అదనీ, ఇదనీ సాధించి, ఒక రాత్రి కిరసనాయిలు పోసి చంపేశారు. మేం వెళ్ళేసరికే అంతా అయిపోయింది" అన్నాడు కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ. గుండె పట్టేసినట్టయిపోయింది నాకు. "ఎన్నాళ్ళయింది" అన్నాను. "సంవత్సరం అవుతోంది" అన్నాడతను.

"వెధవలకి-పోలీసు రిపోర్టిచ్చి రోగం కుదిర్చే వని

**వినాయకచవితి కాలమ్ దాటని కథల పోటీలో రు. 75 రెండవ బహుమతి గెలుచుకున్న రచన**

సింది" అన్నాను.

"అన్నీ అయ్యాయి సార్. ఏం చెయ్యగలం. డబ్బుతో వాళ్ళు నోళ్ళు మూసేసారు. పత్రికల్లో ఆ కేసు వివరాలు కూడా వచ్చాయి. సాక్ష్యాధారాలు లేవని కేసు కొట్టేశారు" అన్నాడు శర్మ నిస్పృహయంగా.

"వాడు మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడా?"

"వాడికేం సార్! నిక్షేపంగా వున్నాడు; పెళ్ళి కూడా చేసుకున్నాడు మరో పిల్ల గొంతు కోసేందుకు!"

నా శరీరంలోంచి రక్తం అంతా ఎవరో తోడేసినట్లయిపోయింది. ఇటువంటివి పత్రికల్లో కాలమ్ దాటని కథలే! కాలమ్ దాటని కథలు! కాలం దాటని జీవితాలు!

**- రాజ్ శ్రీనివాస్**

---

మురళి, అంబిక గాఢంగా ప్రేమించుకున్నారు. ఓ రోజు పార్కులో అడిగింది అంబిక, "ఎప్పుడు పెళ్ళి మాటెత్తినా మా ఇంట్లో అడిగి, ఒప్పించాలి అంటావు. మీ ఇంట్లో ఎవరుంటారు?"

"నా భార్య, ఇద్దరు పిల్లలు" చెప్పాడు మురళి.

---

"పెళ్ళిచూపులు పూర్తయ్యాయి గదా. మీకు అమ్మాయి నచ్చిందా?" అడిగాడు పిల్ల తండ్రి ఆశారావు పెళ్ళికొడుకు తండ్రి అత్యాశారావుని.

"ఓ రిప్లయి కార్డు రాయండి. ఏ విషయం సమాధానం రాస్తాం" అన్నాడు అత్యాశారావ్.

---

"ఏడాది క్రితం ఒకసారి నీ పేరు కలం స్నేహంలో పడిందిగా. మళ్ళీ పంపిస్తున్నావేం?" అడిగింది అన్నపూర్ణ ప్రసన్నని.

"ఈ మధ్య నా హాబీలు కొన్ని మారాయిలే."

—కళ్యాణి తారకనాగ్, బెండమూర్లంక.




---

# పందే నా కిష్టమనుచు బాపడు పలికెన్

**పూరణ**

ముందే చెప్పితిగద, నా
కుందేవలె శ్రాద్ధవేళకు బనసకాయన్
సందేహ మేల? జాగో
పందే నా కిష్టమనుచు బాపడు పలికెన్

ఈ పూరణ కొంచెం వ్యాకరణ పరిజ్ఞానం కలవారికి సులభంగా అర్థం అవుతుంది.

'పనసకాయ దొరికినప్పుడే తద్దినం (ఆబ్దికం) పెట్టమని' ఒక మాట వుంది. ఆ మాటని ఆసరా చేసుకుని చిన్న మెలితిప్పి ఈ కవులు చక్కగా పూరించారు. ఒక బ్రాహ్మణుడు ఇంకొకరితో మాట్లాడుతూ-"ముందే చెప్పాను గదా! ఆబ్దికపు వేళకి పనసకాయ కావాలి. దానికి సందేహం ఎందుకు? నేను (జాగు + ఓపన్ + తే) ఆలస్యాన్ని సహించలేను. వెంటనే పనసకాయని తీసుకురా! అదే నాకు ఇష్టం"అని దీని అర్థం.

రెండు అక్షరాలని చేర్చి పదాలని విచిత్రంగా విరిచి, చక్కటి అర్థాన్ని సాధిస్తూ చేసిన ఈ పూరణ ఆ పండితుల సమయస్ఫూర్తికి, చక్కని పూరణా విధానానికి నిదర్శనంగా లేదంటారా?

## వచ్చేవారం సమస్య

## 'స్తనములు లేని పూరుషుడు సంస్తవనీయుడు కాడు ధాత్రిలో'

అడిగేవాడికి చెప్పేవాడు లోకువ అనే సామెతని మీరు వినే వుంటారు. అది అవధానానికి బాగా అతుకుతుంది. పృచ్ఛకుడు (ప్రశ్నించేవాడు) అవధానిని ఇరకాటంలో పెట్టడానికి ఇలాటి ప్రశ్న వేస్తాడు. దానికి సరసమైన పూరణ దొరికిందా అందరూ ఆనందిస్తారు! దొరకలేదా అవధానికి అప్రతిష్ఠ తప్పదు!! పై సమస్య చాలా ఇబ్బంది పెడుతుంది. అయితేనేం అసాధారణ పాండిత్యం వున్న అవధాని దీన్ని ఎంత అందంగా అప్పటికప్పుడు పూరించాడో గమనించండి. పూరణ వచ్చే వారం.

— సేకరణ: పి. జగన్నాథరావు